



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్

పాల ఉత్పత్తి, సేకరణ పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పాడి పరిశ్రమ రంగాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకు పాల ఉత్పత్తిని, పాల సేకరణను పెంపొందించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జగనన్న పాల వెల్లువ నోడల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని మండలాలతో పాటు, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాల పరిధిలో ఇప్పటి వరకు నిర్వహణలో ఉన్న, విస్తరణ చేపట్టిన గ్రామాలలో పాల ఉత్పత్తి దారుల నుంచి పాల సేకరణ ప్రక్రియను పెంచాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో కూడా 160 లీటర్లకు తగ్గకుండా పాల సేకరణ ఉండాలని తెలిపారు. ఎంపిడిఓలు, మెంటర్లు, ఆర్‌బిసి., ఎపిడ డిసిఎఫ్ వారు పూర్తి బాధ్యతతో కార్యాచరణ చేపట్టాలన్నారు. ఇప్పటికే పాల సేకరణ జరుగుతున్న గ్రామాల్లో రిజిస్టర్ అయిన పాడి రైతులు క్రమం తప్పకుండా పాలు పోసేలా చర్యలు చేపట్టాలన్నారు. పాల ఉత్పత్తి తక్కువగా ఉన్న గ్రామాల్లో రైతులను ప్రోత్సహించాలని చెప్పారు. ల్లా సహకార బ్యాంకుల నుంచి, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల నుంచి పశువుల కొనుగోలు, యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందివ్వాలన్నారు. బల్క్ మిల్క్ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా సహకార అధికారి, పశుసంవర్ధక శాఖ జెడి, డిఆర్‌డిఎ పీడీలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సుభాషిణి, ఎపిడిడిసిఎఫ్ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్. వెంకటేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడి శారదా, ఎంపిడిఓలు, మెంటర్లు, ఆర్‌బిసి., ఎపిడిడిసిఎఫ్ సిబ్బంది, సిసిసి స్టాఫ్ పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం 25 వేల పోస్టులతో మెగా డిఎస్సీ విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించని పరిస్థితిలో ఉందన్నారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఏటా డిఎస్‌సి నిర్వహిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ కనీస అవగాహన లేకుండా టీచర్ పోస్టులు ఖాళీలు గురించి మాట్లాడుతున్నారన్నారు. ఆగస్ట్ లో 700 పోస్టులలో డిఎస్‌సి నిర్వహిస్తామని చెబుతున్నారని, ఇది దారుణమన్నారు. మంత్రి పొంతనలేని లెక్కలతో నిరుద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఒక వైపు నిరుద్యోగులు డిఎస్‌సి ఏర్పాటు కోసం సంవత్సరాల కొద్ది కోచింగ్ సెంటర్‌లలో శిక్షణా తీసుకుంటూ వయోభారంతో అల్లాడిపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి 25వేల పోస్టులతో మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర అధ్యక్షులు షాకీర్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-కలసపాడు

ఆశావర్కర్లను రెగ్యులర్ చేసి వారికి కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైవరప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు విజయమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక కలసపాడు ఆర్‌టిసి ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లపై పనిభారం పెంచుకుంటూ పోతోందని చెప్పారు. టిడి. క్షయ, కేన్సర్, హెచ్ఐవి ఇతర జబ్బులున్న వారి గళ్లను ఆశావర్కర్లే సేకరించి ల్యాబ్ తీసుకెళ్లాలని, అక్కడి నుంచి మళ్లీ రిపోర్టను తేవాలని వైద్యులు చెప్పడం దుర్మార్గమన్నారు. వారికి ఇచ్చే వేతనాన్ని రెండు దఫాలుగా ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎఎన్ఎంలు చెప్పిన పనులు ఆశావర్కర్లు చేయకపోతే వేతనాల్లో కోత విధిస్తున్నారని వాపోయారు. సెలవులు తీసుకుంటే వేతనాలు కట్ చేయడం సమంజసం కాదన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఉదయం కడప డిఎంహెచ్ఓ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఓబులాపురం విజయమ్మ, ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి రాజమ్మ, కలసపాడు మండల నాయకులు సౌదమ్మ, మాబుచాన్, లక్ష్మీదేవి, మార్తమ్మ, సుధారాణి, ఆశా పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప



ఆర్థిక సాయం చేస్తున్న పస్తం అంజి

ప్రమాదవశాత్తు కింద పడి వెన్నెముక విరిగి నడవలేని పరిస్థితిలో ఉన్న జంపు సాయికృష్ణకు బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు, వైసిపి యువజన జిల్లా కార్యదర్శి పస్తంఅంజి రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రొద్దుటూరు బుడగ జంగం కాలనీలో ఉంటున్న జంపు సాయి కృష్ణ కూలీ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు నాలుగవ అంతస్తు నుంచి కిందపడి వెన్నుముక విరిగి నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న పస్తం అంజి ఆధ్వర్యంలో సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పస్తం అంజి మాట్లాడుతూ త్వరగా ఆ యువకుడు కోలుకోవాలని ఆకాంక్షించారు. లక్షమయ్య, డి. రాముడు, సి చిన్న వెంకటయ్య, ఎం జమ్మయ్య, సి వెంకటయ్య, కే. ఆంజనేయులు, పి. ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి చింతకొమ్మదిన్నె

భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వ్యవస్థాపక దినోత్సవం సోమవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ నమూనా క్షేత్రంలో సేంద్రీయ పద్ధతిలో పెంచుతున్న కంది పంటను, మెట్ట వ్యవసాయ పద్ధతులైన లోతు దుక్కులు, పంట కుంటలను సమీకృత వ్యవసాయ పద్ధతులను వివరించారు. ఇంకా యంత్ర పరికరాలను, వానపాముల ఎరు వుల తయారీ కేంద్రం. బ్లాక్ బెంగాల్ మేకల పెంపక కేంద్రం, బెడస కోళ్ల పెంపక కేంద్రం, ప్రథమ ప్రక్రియ పరికరాలను, చిరుధాన్యాలకు విలువ జోడించే యూనిట్‌ను, డ్రాగన్ ఫ్రూట్స్, అంజూర, ఇతర ఉద్యాన వన పంటలను సందర్శనలకు చూపిస్తూ వాటి వల్ల కలిగే ఉపయోగాలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శిల్పకళా, మహేష్ బాబు,ప్రశాంతి, సాయి మహేశ్వరి పాల్గొన్నారు.

'మా భూమి ఇప్పించండి'

కడప అర్బన్ : బద్వేల్ మండలం, చెన్నంపల్లి గ్రామనివాసి తంబిశెట్టి సరస్వతి తమ భూమి ఇప్పించాలని వేడుకున్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నంపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 1616/5 లో ఎకరా 30 సెంట్లు డీకేటి తన పేరు మీద పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చి మంజూరు చేశారని తెలిపారు. 1బి, అడంగల్ 2020 వరకు ఆన్‌లైన్‌లో తన పేరుమీదే ఉందని చెప్పారు. రియల్ ఎస్టేట్ కబ్జాదారులు, రాజకీయ నాయకుల పలుకుబడితో కొంతమంది భూమి ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భూమి అని చెప్తే దుర్భాషలాడుతూ అవమానిస్తున్నారని వాపోయారు. అధికారులు న్యాయం చేయాలని వేడుకున్నారు. సమావేశంలో వెంకటసుబ్బయ్య, వెంకటేశు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలంటూ

దళితుల రాస్తారోకో

రోడ్డుపై బైఠాయించిన దళిత కాలనీ వాసులు

ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు

తోపులాటలో సొమ్మసిల్లిన మహిళ

108 వాహనంలో ఆస్పత్రికి తరలింపు

గంటపాటు నిలిచిన వాహనాల రాకపోకలు

పజాశక్తి - బద్వేలు

జగనన్న స్మా ర్ట్ సిటీ కోసం అధికారు లు దళితుల భూములను తీసుకున్నారు. ఇంత వరకూ ఎలాంటి నష్ట పరి హారం, ప్రత్యామ్నాయం చూపకపోగా పనులు ప్రారంభిస్తుండడంతో బాధితులు రోడ్డెక్కారు. జాతీయ రహదారిపై టైర్లు, కంచెలు వేసి బైఠాయించారు. తమకు ప్రత్యామ్నాం చూపకుండా ఎలా పనులు మొదలు పెడతారంటూ అధికారులను నిలదీశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదగొట్టే ప్రయత్నం చేయగా దళితులు, మహిళలు వారిని వారించారు. ఆందోళనకారులకు, పోలీసులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. తోపులాటలో ఓ మహిళ సొమ్మసిల్లి పోవడంతో స్థానికులు ఆమెను 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు... జగనన్న స్మార్ట్ సిటీ కోసం గోపవరంలోని సర్వేనంబర్ 1751 నుంచి 1761 వరకు జెడ్‌హెచ్‌డిసి కింద గతంలో ప్రభుత్వం 28 మంది లబ్ధిదారులకు 68 ఎకరాలను ఇచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వం జగనన్న స్మార్ట్ సిటీ కోసం దళితుల నుంచి సేకరించారు. అందులో 35 ఎకరాల్లో వెంచర్ వేసేందుకు సోమవారం పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేశారు. విషయం తెలుసుకున్న మడకవారిపల్లె దళితులు నెల్లూరు జాతీయ రహదారి 67 పైకి వచ్చి ఆందోళన చేపట్టారు. కంప మొక్కలు, టైర్లు రోడ్డుకు అడ్డుగా పెట్టి రాస్తారోకో నిర్వహించారు. సుమారు కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. బద్వేల్ రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన కారులను చెరదగొట్టే ప్రయత్నం చేశారు. ఈనేపథ్యంలో మహిళలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తోపులాటలో ఓ మహిళ సొమ్మసిల్లి పోవడంతో స్థానికులు ఆమెను 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రూరల్ సిఐ హనుమంతనాయక్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బలవంతంగా చెదరగొట్టి కొంత మందిని అరెస్టు చేశారు. వామపక్ష నాయకులు ఆందోళనకారులకు సంఘీభావంగా నిలిచి నిరసన తెలియజేశారు. అనంతరం సిఐ, ఎస్ఐ మాట్లాడుతూ ఏదైనా సమస్య ఉంటే ఆర్‌డిఒకు విన్నవించుకోవాలని చెప్పడంతో వారు సద్దుమనిగారు.



రోడ్డుపై టైర్లు, ముళ్ల కంప వేసి నిరసన తెలియజేస్తున్న ఆందోళన కారులు



ఆందోళనకారుల్ని చెదరగొడుతున్న పోలీసులు

చదువుతోనే పేదరిక నిర్మూలన : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేదవాడూ చదువుకోవాలని, సాంఘికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ముఖ్యమంత్రి ఆశయాలను నెరవేర్చాలని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. సోమవారం కడప నగరంలోని 26, 39 వ డివిజన్లలోని సచివాలయాల్లో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి 'జగనన్న సురక్ష' శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను ఆయన పరిశీలించి, శిబిరానికి హాజరైన స్థానికులను పలకరించి ప్రభుత్వ సేవల గురించి అడిగారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాల మేరకు పాటు పేదవాడు ఉన్నత చదువులు అభ్యసించి సాంఘికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. వారం రోజులుగా జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో వాలంటీర్లు ఇంటింటి సర్వే చేసి అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని సచివాలయాల వారీగా 'జగనన్న సురక్ష'శిబిరాల్లో పరిష్కరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అఫ్జల్ ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, సోషల్ వేల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ బంగారు నాగయ్య, వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, స్థానిక కార్పొరేటర్లు త్యాగరాజు, కమాల్ బాషా, ఇతర కార్పొరేటర్లు షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు నరపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, జయచంద్రా రెడ్డి, సంపత్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

నెల్లూరుపై కర్నూలు జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ - 19 మల్టీ డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఓఆర్ఎంక్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 239 పరుగుల తేడాతో కర్నూలు జట్టు ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 395 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసింది. 8 వికెట్ల నష్టానికి 140 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 38.3 ఓవర్లలో 146 పరుగులకు ఆల్ అవుట్ అయింది. దీంతో కర్నూలు జట్టు 281 పరుగుల విజయ లక్ష్యాన్ని నెల్లూరు జట్టు ముందు ఉంచింది. రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 15.3 ఓవర్లలో 43 పరుగులకే ఆల్ అవుట్ అయి ఓటమి చెందింది. కర్నూలు జట్టులోని డి అక్షిత్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించాడు. 8 ఓవర్లు బౌలింగ్ చేసి అందులో మూడు మేడిన్ వేసి 22 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీసుకోవడం విశేషం.

డ్రాగా ముగిసిన కడప చిత్తూరు జట్ల మ్యాచ్.. కడప, చిత్తూరు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 279 పరుగులు చేసింది. 7 వికెట్ల నష్టానికి 383 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 104.4 ఓవర్లలో 438 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 64, ప్రణవ్ రెడ్డి 78, ప్రనిల్ రెడ్డి 74 పరు గులు చేశారు. చిత్తూరు జట్టులోని డి. బాలాజీ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు చివరి రోజు ఆట ముగిసే సవ ంయానికి 77.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. ఆ జట్టులోని గౌతమ్ కృష్ణ తేజ రెడ్డి 78 (నాట్ అవుట్), జెనిక్ దాస్ 65 పరుగులు చేశారు. కడప జట్టులోని సాయి అర్జిత్ రెడ్డి 2 రెండు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - కడప



అన్నదానం చేస్తున్న కళ్యా సుధాకర్

శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతి సందర్భంగా సోమవారం శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ అధ్యక్షులు కళ్యా సుధాకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరి దేవాలయం వద్ద ప్రజలకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కొరముట్ల సుబ్బరాయుడు, వీర క్షత్రియ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, కోశాధికారి టేకూరి సుదర్శన్, వెలిగండ్ల సుబ్బరాయుడు, అన్నం శంకర్, పల్లా బాలచౌడన్న, బండి కృష్ణ య్య, కాల్వ వాగేష్ ఇడెం సురేంద్ర, టేకూరి పుష్పాంగధ గుర్రం నటరాజ్, ఇడెం రామమునెయ్య ఆలయ కమిటీ సభ్యులు, సంఘం నాయకులు, శ్రీ చౌడేశ్వరి దేవి భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా జయంతి వేడుకలు.. కడప నగరంలోని శ్రీ విజయ దుర్గ కాలనీ పార్కులో శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు పురస్కరించుకొని కాలనీ మహిళలు అందరూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు గోవిందు నాగరాజు, సంగినాదం ఆంజనేయులు, సిఆర్ఐ వెంకట లక్ష్మమ్మ, గోవిందు వెంకటసుబ్బమ్మ, అరుణ నారాయణమ్మ, అమ్మవారి భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **చెన్నూరు :** శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి 94వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం నిర్వహించినారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాన్ని అందుకున్నారు కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీన్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల. సురేష్ యాదవ, చెన్నూరు టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, అల్లి శ్రీరామ్మూర్తి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.


ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కే.కే.ఎన్.అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. బాధితులతో స్వయంగా మాట్లాడి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

మాస్టర్ లాలో గౌతమికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-కడప ప్రతినిధి



గోల్డ్‌మెడల్ చూపుతున్న గౌతమి

కడప నగరానికి చెందిన గౌతమి సంఘమిత్రకు మాస్టర్ ఆఫ్ లాలో గోల్డ్ మెడల్ లభించింది. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోమవారం నిర్వహించిన కాన్వగేషన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ గోల్డ్ మెడల్ అందజేశారు. సంఘమిత్ర తండ్రి సంపత్ కుమార్ కడప నగరంలో ప్రముఖ న్యాయవాదిగా 35 సంవత్సరాలు పని చేయడమే కాకుండా అభ్యుదయ వాదిగా పలు సేవలందిస్తున్నారు. ఆమె తల్లి మనోరమ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. గోల్డ్ మెడల పొందిన గౌతమి సంఘమిత్ర మాట్లాడుతూ నాన్న ఆదర్శంగా క్రిమినల్ లా చేసేందుకు ఎస్‌కెయూలో సీటు పొందానని తెలిపారు .ఇక్కడ ప్రొఫెసర్లు శ్రీరాములు, పుల్లారెడ్డి ప్రోత్సాహంతో బాగా చదివి మంచి మార్కులు సాధించి గోల్డ్ మెడల్‌కు ఎంపిక అయ్యానని పేర్కొన్నారు. ప్రస్తుతం కడపకోర్టు బార్‌లో క్రిమినల్ లాయర్ గా పనిచేస్తున్నారని తెలిపారు. గౌతమి సంఘమిత్ర మాస్టర్ లా లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

అర్జీదారుల సమస్యలకు తక్షణ పరిష్కారం

కడప : ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక 'స్పందన' ద్వారాఅర్జీదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జెసి జి.గణేష్ కుమార్, డిఆర్ఓ గంగాధర్‌గౌడ్, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు యదుభూషన్‌రెడ్డి, ఆనంద్ నాయక్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి అందే విజ్ఞప్తులను సంబంధితాధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారించాలని చెప్పారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా సమస్యకు పరిష్కారం అందించాలన్నారు. కమలాపురం మండలం పందిళ్లపల్లె గ్రామానికి చెందిన చెన్నారెడ్డి గారి నాగసుబ్బమ్మ ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూసర్వే కార్యక్రమంలో భాగంగా తనకు చెందిన భూమి విస్తీర్ణం తక్కువగా చూపుతోందని.. తనకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. గోపవరం మండలం రామంజనేయ నగర్‌కు చెందిన బత్తల వెంకట రమణయ్య సోమశిల ప్రాజెక్టు వల్ల తన భూమి కోల్పోయానని. నష్టపరిహారం అందలేదని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కలసపాడు మండలం దూలం వారిపల్లెకు చెందిన సుదర్శనం తన ఇంటి స్థలానికి సంబంధించి హద్దులు చూపించాలని కోరుతూ కలెక్టర్ అర్జీ సమర్పించారు. కార్యక్రమంలో సిపిఒ వెంకటరావు, హౌసింగ్ పీడి కృష్ణయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న, ఎల్‌డిఎం దుర్గా ప్రసాద్, వ్యవసాయ శాఖ జెడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న డిఇఒ

- ఉత్తర్వులను వెనక్కి తీసుకోకపోతే పోరాటం తప్పదు

- రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - కడప అర్బన్

సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు నిరసన కార్యక్రమాలలో పాల్గొనకూడదని, అలా పాల్గొంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి ఉత్తర్వులు జారీ చేయడం ఆయన నిరంకుశ వైఖరికి నిదర్శనమని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విమర్శించారు. తక్షణం ఉత్తర్వులను ఉపసంహరించుకోకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ జిల్లా విద్యాశాఖాధికారి జారీచేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు నాయక్ అధ్యక్షతన విద్యార్థి, యువజన సంఘాలతో పాత బస్టాండ్ వద్ద సిఐటియు కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల హక్కులు, వారి సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు పోరాటాలు చేసేందుకు వీలు లేదు అని చెప్పడం డిఇఒ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వ అధికారిగా కాకుండా అధికార పార్టీ నాయకులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు దగ్గర ఉండటం వల్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటాలు చేయకూడదని వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా డి.ఈ.ఓ ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు. జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని విద్యాసంస్థలు నడుస్తున్నా, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేసి దోపిడి చేస్తున్నా చర్యలు తీసుకోలేని డిఇఒ విద్యార్థులను మాత్రం ర్యాలీలు, ధర్నాలలో పాల్గొనకూడదని ఆదేశాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారి తను జారీ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు మామిళ్లబాబు, పిఎస్‌యూ జిల్లా నాయకులు నాగేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి జియావుద్దీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తిరుమలేసు హాజరయ్యారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, గోపి పాల్గొన్నారు.

బద్వేలు : విద్యార్థులు నిరసన కార్యక్రమాలలో పాల్గొంటే వారిపైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవ రెడ్డి ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. డిఇఒ ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని సోమవారం స్థానిక సుందరయ్య భవనం నందు డివైఎఫ్ఐ పట్టణ నాయకులు సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని వారు తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేందుకు వీలు లేదని చెప్పడం డిఇఒ నిరంకుత్వానికి నిదర్శమని చెప్పారు.

నిధులు స్వాహా చేయడం దుర్మార్గం

- సర్పంచుల సంఘం నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - కడప అర్బన్

పంచాయతీ నిధులను దారి మళ్ళించిన వైసిపి ప్రభుత్వ తీరుకు నిరసనగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఏపీ సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు మునిరెడ్డి, కొండయ్య హెచ్చరించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 14,15వ ఆర్థిక సంఘం నిధులు కింద రూ.8,660 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని పేర్కొన్నారు. సర్పంచుల చెక్కులపై సంతకాలు, అనుమతి, గ్రామపంచాయతీల తీర్మానాలు, గ్రామసభల తీర్మానాలు లేకుండా, సర్పంచ్లకు చెప్పకుండా నిధులను రాష్ట్ర ప్రభుత్వం దొంగలించిందని తెలిపారు. నిధులు లేక గ్రామాలలో రోడ్లు, తాగునీరు, పారిశుధ్య పనులు చేయలేక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రాష్ట్ర పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శిని, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం ఇచ్చినా ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. 12, 9 1 8 గ్రామ పంచాయతీలు రాష్ట్రంలో జీరో బ్యాలెన్స్ లో నడుస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్ననిధులను వెంటనే వెనక్కి ఇవ్వాలని లేనిపక్షంలో ఆందోళన పోరాటాలకు శ్రీకారం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు సర్పంచులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి

చిల్డ్రన్స్ క్లబ్ ద్వారా చారిత్రక అవగాహన

ప్రజాశక్తి కడప అర్బన్

పాఠశాలల్లో విద్యార్థుల ఇంటాక్ క్లబ్‌లనును ఏర్పాటు చేయడం ద్వారా వారికి చరిత్రపట్ల అవగాహన కల్పించ వచ్చునని భారత జాతీయ కళావారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ కె. చిన్నప రెడ్డి అన్నారు. ఇటీవల జాతీయస్థాయిలో ఆయా ప్రాంతాల సంప్రదాయ ఆహా రంపై నిర్వహించిన జిల్లాస్థాయి విద్యార్థుల వ్యాసరచన పోటీల్లో కడప నగరం నాగ రాజుపేట మున్సిపల్ హైస్కూలుకు చెందిన 10 మంది విద్యార్థులకు చిల్డ్రన్స్ క్లబ్ సభ్యత్వం లభించింది. సోమవారం పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిన్నపరెడ్డి మాట్లాడుతూ తమ పరిసరాల గురించి, చరిత్ర గురించి తప్పక తెలుసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుని ఒ. కవితా సుధారాణి మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతీగల ఇంటాక్ ఇటీవల నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులకు చిల్డ్రన్స్ హెరిటేజ్ క్లబ్ పాసు పోర్టులు లభించడం గర్వకారణమన్నారు. అనంతరం ఎంపికైన పదిమంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, వారసత్వ పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. ఇంటాక్ కో - కన్వీనర్ పి.వి. సుబ్బారెడ్డి సంస్థ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రణాళికా కార్యదర్శి వి. గౌరీ శంకర్, టెంపుల్ హెరిటేజ్ కార్యదర్శి ఎస్. భారవి, కార్యాలయ అధ్యక్ష కార్యదర్శులు బి. కొండా రెడ్డి, కె. రాఘవేంద్ర వర్మ, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, (రూట) జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉద్యోగోన్నతి ఉపాధ్యాయులు ఇర్షాద్ అహ్మద్, సయ్యద్ ఇక్బాల్, అబుల్ వఫా మస్తాన్ వలీ, షాహిదుల్లాను రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా ఘనంగా సత్కరించారు. సోమవారం సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడానికి అహర్నిశలు కృషి చేయాలని సన్మాన గ్రహీతలకు కోరారు. కార్యక్రమంలో రూట రాష్ట్ర నాయకులు డాక్టర్ వసీవుల్లా సాహెబ్, సత్తార్ ఫైజి, ముహమ్మద్ అయ్యూబ్, షహబుద్దీన్, జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముహమ్మద్ ఇర్షాద్, జాకీర్ హుస్సేన్, ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్ బాషా, జిల్లా ఆర్థిక కార్యదర్శి మహబూబ్ బాషా, నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రూటా నాయకులు

నారా లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం



టిడిపి యువ నాయకుడు నారా లోకేష్‌బాబును మండల టిడిపి నాయకులు కలిశారు. సోమవారం ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో కడప పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మురళి యాదవ్, కొందరు యువ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ బిసి సెల్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పలు కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా రాబోయే సార్వత్రిక ఎన్నికలలో యువత అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని టిడిపిని విజయపథంలో నడిపించాలని కోరినట్లు తెలిపారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరు కెనరా బ్యాంకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు కొండాపురం మసీదు సమీపంలో కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు మేనేజర్ తెలిపారు. శిబిరంలో కెనరా బ్యాంక్‌లో నూతన బ్యాంకు ఖాతాలు ప్రారంభిస్తామన్నారు. అలాగే బ్యాంకు అందిస్తున్న బంగారు ఆభరణ, గృహ, వాహన రుణాలు, ఫిక్స్డ్ డిపాజిట్ వంటి సేవలు గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కొండాపురం పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సలహాలు సంప్రదింపులకు బ్యాంకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

నేటి బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - దువ్వూరు

మండల కేంద్రమైన దువ్వూరు మూడు రోడ్ల కూడలిలో మంగళవారం సాయంత్రం జరుగు తెలుగుదేశం పార్టీ చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి అతిరథ మహారథులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

యుద్ధప్రాతిపదికన నీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని 14,15,16 వార్డు పరిధిలోని ప్రజలకు తాగునీటి సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గడ్డ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బోరేను ఎమ్మెల్యే, 17 వార్డు కౌన్సిలర్ బేపారి నూరున్నీసా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంకా మిగిలి ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వెల్లల శివమ్మ, వైసిపి నాయకులు బడిగింజల చంద్రమౌళి, జనార్ధన్, మురళి, 17 వార్డు ఇంచార్జ్ బేపారి షాఫర్ అలీ, మహమ్మద్ రఫీ, మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ డిఇ బలమల్లేశ్వర్, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఫిట్‌నెస్ లేని విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా తమ విద్యాసంస్థల వాహనాలను నడుపుతున్నారన్నారు. కాలం చెల్లిన పాత బస్సులు, బస్సులలో క్లీనర్ ఉండడంలేదన్నారు. ఆర్‌టిఒ అధికారులు విద్యాసంస్థల బస్సులపై తనిఖీలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బాషా, శివ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపల వేటకెళ్లి బురదలో చిక్కుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని స్థానిక అగ్రహారం గ్రామానికి చెందిన మామిళ్ళ శ్రీనివాసులు (48) చేపల వేటకెళ్ళి బురదలో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం స్థానిక వక్కిలేరులో చేపలు పట్టేందుకు వెళ్లారని, ఇంటికి ఎంతకు రాకపోవడంతో సోమవారం ఒక్కిలేరు వాగు వద్దకు వెళ్లి గాలించగా బురదలో చిక్కుకున్నట్లు గుర్తించారని తెలిపారు. ఒక్కిలేరు వాగు వద్ద మృతుడి పాదరక్షలు, దుస్తులు లభ్యమయ్యాయని తెలిపారు. కేసు దర్యాప్తు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం : నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - దువ్వూరు

మండల పరిధిలోని జిల్లెల్ల గ్రామం వద్ద దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను దువ్వూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మైదుకూరు సిఐ చలపతి మాట్లాడుతూ జిల్లెల్ల గ్రామ సమీపాన కుందునది ఒడ్డున పొదల్లో దాచి ఉంచిన దుంగలను స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురు నిందితులను అరెస్టు చేసి వారిని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సన్నపల్లి గ్రామ సమీపంలోని కుందూ నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, వాటి యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాజరాజేశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. గతంలో ఇసుక అక్రమ రవాణా కేసులలో ఉన్న ఐదుగురిపై బైండవర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

గంజాయి విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు–కడప రహదారిలోని తిమ్మాపురం గ్రామం సమీపంలో ఉన్న డాబా వద్ద గంజాయి విక్రయిస్తున్న గంగారామ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు సిఐ నరేష్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద సోమవారం సిఐ మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామ సమీపాన రాజస్థాన్‌కు చెందిన రంగారామ్, హీరారామ్ కలిసి డాబా నిర్వహిస్తున్నారు. వీరిలో గంగారామ్ డాబా వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు చెప్పారు. సిఐ, ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న గంగారామ్‌ను అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి దాదాపు 3కిలోల 150 గ్రాముల గంజాయి స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. రాజస్థాన్‌కు చెందిన విజయ్‌చౌదరి ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి డాబా నిర్వాహకులకు విక్రయించినట్లు చెప్పారు. వీరు ఇక్కడ లారీ డ్రైవర్లకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. హీరారామ్, విజయ్‌చౌదరి పరారీలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఇబి ఇన్స్‌పెక్టర్ చెన్నారెడ్డి పాల్గొన్నారు.

సేవ ఆనందాన్నిస్తుంది : 'అల్ షిఫా' మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి - కడప అర్బన్

మానసిక విభిన్నప్రతిభావంతుల పిల్లలకు అన్ని విధాల శిక్షణ ఇస్తూ ఆటల పోటీలలో విదేశాలకు వెళ్లడమే కాకుండా గోల్డ్ మెడల్ సంపాదించిన తమ విద్యార్థులను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే తపన ఉందని అల్ షిఫా మానసిక విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్ర వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ తెలిపారు. ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ అల్ షిఫా మానసిక విభిన్నప్రతిభావంతుల పునరావాస కేంద్రాన్ని 2001, ఏప్రిల్ 20వ తేదీ ప్రారంభించామన్నారు. మొదట్లో కేవలం 6 మంది పిల్లలతో ప్రారంభమైందన్నారు. దినదినాభివృద్ధితో అదే సంవత్సరం 32 మంది చేరారని తెలిపారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో మొట్ట మొదటి పునరావాస కేంద్రం కుల, మతాలకు, వర్ణాలకు అతీతంగా సేవలను అందిస్తూ 22 ఏళు పూర్తి చేసుకుందన్నారు. ఇప్పటివరకు 569 మంది విభిన్నప్రతిభావంతులకు సేవ చేశామని పేర్కొన్నారు. ఇందులో శిక్షణ తీసుకున్న ఎంతోమంది పిల్లలు వికలాంగుల నుంచి సకలాంగులుగా మారి జనజీవనంలో కలిసి ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. 2016వ చట్టాన్ని అనుసరించి ఎపి ప్రభుత్వం మొదటిసారిగా కడప జిల్లాలో మానసిక విభిన్నప్రతిభావంతుల పిల్లలను ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశం కల్పించడం జరిగిందని, ఆ ఉద్యోగ అవకాశాలను తమ అల్ షిఫా మానసిక విభిన్న ప్రతిభాంతుల పునరావస కేంద్రం నుంచి శిక్షణ తీసుకున్న అబ్బాయిని నేడు ప్రభుత్వ ఉద్యోగిగా చేయడంలో కృషి చేశామన్నారు. చాలామంది అమ్మాయిలు వారు స్వతహాగా ఇళ్లల్లో పనులు చేసుకుంటూ తమ కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనాన్ని సాగిస్తూ ఉన్నారన్నారు. మనస్ఫూర్తితో సేవలను అందిస్తున్న సిబ్బంది సహకారంతో 23వ సంవత్సరంలోకి అడుగు పెట్టామన్నారు. ఆటల పోటీల్లో ప్రత్యేక శిక్షణ నేర్పించి తమ పిల్లలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభాపావటాలు ప్రదర్శించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఏషియన్ స్పెసిఫిక్ గేమ్స్‌లో తమ పిల్లవాడు పాల్గొన్నాడని చెప్పారు. ఈ ఆటలు ఆస్ట్రేలియా దేశం అక్కడికి తమ విద్యార్థి మలిశెట్టి సాయినాథ్‌ని తీసుకెళ్లామన్నారు. సేవా కార్యక్రమాల్లో కూడా ముందుండి తమ చేతనైన సహాయ సహకారాలు అందించడంలో ముందు ఉంటామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పునరావాస కేంద్రం పాత రిమ్స్ ఆవరణలో ఉందన్నారు. గత ఏడాది నుంచి అధికారుల సూచన, తల్లితండ్రుల అభ్యర్ధన మేరకు జిల్లాలోని మొట్టమొదటి వయోవృద్ధుల మానసిక విభిన్న ప్రతిభావంతుల కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. 18 ఏళ్ల పైబడి వయసున్న మానసిక విభిన్న ప్రతిభావంతులను తమ కేంద్రంలో వారికి తగిన విధంగా శిక్షణను ఇస్తూ ఉన్నామని పేర్కొన్నారు. ఇందుకు సహకరిస్తున్న జిల్లా అధికారులకు, అనధికారులకు, తల్లితండ్రులకు ఎంతో రుణపడి ఉన్నామని రఫీ తెలిపారు. రాబోయే రోజుల్లో మానసిక విభిన్నప్రతిభావంతుల పిల్లలకు, అలాగే పెద్దవారికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. గతంలో రాష్ట్రానికి విచ్చేసిన మాజీ గవర్నర్ సుశీల్ కుమార్ షిండే, కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, కలెక్టర్, ఎస్‌పి, ఇతర ఉన్నతా ధికారులు, అనధికారులు తమ సేవలను కొని యాడారని తెలి పారు. భవిష్యత్తులో ఏదైనా అవస రం ఉంటే, తాము ముందుండి సహాయ సహ కారాలు అందిస్తామని వారు హామీ ఇచ్చారని రఫీ పేర్కొన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న చాలామంది పిల్లలు, సకలాంగులతో సమానంగా, స్వయం ఉపాధి పొందుతూ తమ జీవితాన్ని ప్రశాంతంగా కొనసాగిస్తున్నారని ఆయన వివరించారు.



ప్రముఖులచే సన్మానం అందుకుంటున్న రఫీ (ఫైల్)



జడ్జి, విభిన్నప్రతిభావంతుల శాఖ ఎడి కృష్ణ కుమార్‌తో రఫీ

కనీస వసతులు కల్పించాలి : సిపిఎం



సిపిఎం నాయకులు, లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అమృత్‌నగర్‌లో రోడ్లు, మంచినీరు, విద్యుత్తుతోపాటు ఇళ్ల రుణాలను కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. ఆ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ 2008/2018లో ఇంటి స్థలాలు ఇచ్చారని, దాదాపుగా వెయ్యి మందికి పైగా లక్షలు ఖర్చు చేసి బేస్ మట్టాలు వేసుకున్నారన్నారు. మరొక ఎనిమిది వందల మందికి 2018లో స్థలాలు ఇచ్చారని, వారు ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపుగా 15ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు వారికి మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. పేదవారు బాడుగ ఇళ్లలో ఉంటూ పెరిగిన కరెంటు చార్జీల భారం భరించలేకున్నారన్నారు. జగనన్న కాలనీలకు రోడ్లు, నీరు, విద్యుత్తు, ఇంటి రుణాలు వెంటనే కల్పిస్తున్నారని, వీరికి ఎందుకు అలా చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు వెంటనే స్పందించాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ కొత్తపల్లి పంచాయతీ వారితో మాట్లాడి విద్యుత్తు, మంచినీటి పైపులైన్లకు ఎస్టిమేషన్ లెటర్ పెట్టమని తెలిపారు. ధర్నాలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, మహిళా సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సర్వేశ్వరి, వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, సిపిఎం నాయకులు చెన్నారెడ్డి, బాలసుబ్బయ్య, శేఖర్, లబ్ధిదారులు వెంకటేశ్వర్లు, హసీనా, దస్తగిరి పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులంతా ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్యవైశ్యులు అందరూ ఐక్యమత్యంగా ఉండి తమ అభివృద్ధికి పాటుపడాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వాసవి మాతా ఆర్యవైశ్యుల సంఘం అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాయవరం సురేంద్ర ఇంటికి సోమవారం వెళ్లి అభినందించారు. ఆర్యవైశ్యుల సమస్యలు పరిష్కరించేందుకు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం ఇటీవల హై బిపితో హైదరాబాద్‌లో చికిత్స తీసుకుని ఇంటికి వచ్చిన టిడిపి మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్‌ను పరామర్శించారు. మాజీ సర్పంచ్ రాయవరం ఇంటికి వెళ్లి ఆయనను కూడా పరామ ర్శించారు. వడ్డే వీధిలో లివర్ వ్యాధితో బాధపడుతున్న చింతకాయల మున్నాను బిటెక్ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. పిరమిడ్ నగర్‌లో చౌడమ్మ దేవి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో బిటెక్ రవీంద్రానాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, దేవస్థానం మాజీ చైర్మన్ జయచంద్రరెడ్డి, మైనార్టీ నేత మహమ్మద్ దర్బార్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, బిసి మండల కన్వీనర్ గోగుల మల్లికార్జున, డక్కా రమేష్, జబిబుల్లా, గొటూరు నాగభూషణం, అలిరెడ్డిపల్లె బాలకృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



సురేంద్రను సన్మానిస్తున్న బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

గండికోట ముంపువాసుల గుండె రోధిస్తోంది :'దేవగుడి'



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

గండికోట ముంపువాసుల గుండె రోధిస్తోందని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గండికోట ముంపువాసులను ఎన్నో రకాలుగా ఇబ్బంది పెడుతోందన్నారు. ఆయన సోమవారం ముంపువాసుల ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ముంపువాసులు తనతో తమ ఆవేదనను వ్యక్తం చేశారని తెలిపారు. ముంపునకు గురైన 22 గ్రామాల బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతమన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం 2007ను కటాఫ్ డేట్‌గా నిర్ధారించి, 18 ఏళ్లు నిండిన వారికి నష్టపరిహారంగా రు.1,86,000 చెల్లించింది. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం కటాఫ్ డేట్‌ను 2017 సెప్టెంబరు 30 వరకు పెంచి, నష్టపరిహారాన్ని రూ.6,75,000 చెల్లించిందన్నారు. గండికోట జలాశయం ముంపు బాధితులకు పునరావాస పథకం కింద పరహారాన్ని రూ.10,00,000లకు పెంచి చెల్లిస్తామని 2019 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి వాగ్దానం చేసి, దాన్ని అమలు చేయాలని నిర్వాసితులు పలు రూపాల్లో ఆందోళనలు చేశారన్నారు. ముంపు బాధితుల సమస్యలను పరిష్కరించిన తర్వాతే గండికోట జలాశయంలో నీటిని పూర్తి స్థాయిలో నిల్వ చేస్తామని శాసనసభలో కూడా హామీ ఇచ్చారన్నారు. ఇందుకు భిన్నంగా గండికోట జలాశయంలో పూర్తి స్థాయిలో 26.85 టియంసి నిల్వ చేసి, నిర్వాసితులను నీట ముంచారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాజాగా రూ.451.6 కోట్ల పరిహారం చెల్లించడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఆలస్యంగానైనా మంత్రివర్గం తీసుకొన్న నిర్ణయం ముంపు బాధితులకు ఉపశమనం కలిగించే నిర్ణయమన్నారు. కానీ, ఇంత వరకు జిఒ విడుదల చేయలేదన్నారు. మరోవైపు ముంపు బాధితులు మళ్లీ ఆధార్, రేషన్ కార్డు, తదితర ఆధారాలను సమర్పించి, బాధితులమని రుజువు చేసుకోవాలని షరతులు పెట్టడం అత్యంత గర్హనీయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని నారాయణరెడ్డి వివరించారు. కార్యక్రమంలో సామాజిక ఉద్యమ కుమారుడు టి.లక్ష్మీనారాయణ కొండాపురం నాయకుడు గోరుశెట్టి బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు శ్రావణ మాస ఉత్సవాలపై సమావేశం

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గండిక్షేత్రంలో 2023 సంవత్సరం శ్రావణమాసం మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించుటకు పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 19న బుధవారం ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ఈ సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యుత్ ఉద్యోగ, కార్మిక సదస్సును జయప్రదం చేయాలి

ఎర్రగుంట్ల : ఎపి జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్‌లలో పనిచేసే ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న విజయవాడలో జరగబోవు సదస్సును జయప్రదం చేయాలని స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శులు వెన్నపూస సుబ్బిరెడ్డి, పొన్న శివయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఆర్టీపీపీలో సోమవారం ఉద్యోగులు, కార్మికులతో వారు సమావేశాన్ని ఏర్పాటు చేసి, సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఉద్యోగ సంఘ నాయకులు యన్.కొండారెడ్డి, వెంకటస్వామి, హరి, ఓబుళరెడ్డి, గంగాధర్, ఖాజా, భాస్కర్, హమీద్, కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గంగయ్య, నాగేంద్ర, రాము, పుల్లారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతి మహోత్సవం

కొండాపురం : టీ కోడూరు గ్రామంలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారి జ్యోతి మహోత్సవం సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు ఆంజనేయులు ఆచారి ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సహకారంతో ఘనంగా జరిగింది. ప్రొద్దుటూరుకు చెందిన మహానందయ్య బృందంచే పలకల భజన ఏర్పాటు చేశారు. ఎంపిటిసి రామ్మోహన్‌రెడ్డి, సర్పంచు, భక్తులు పాల్గొన్నారు. అన్నదానానికి తాడిపత్రికి చెందిన దుస్తుల వ్యాపారి బాలయ్య ఆర్థికసాయం చేశారు. కొండాపురం సిఐ సుదర్శన ప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్ఐలు రవికుమార్, ప్రవీణ్‌కుమార్, సంజీవరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - వేంపల్లె



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లోనే గ్రామ సచివాలయాలు నిర్మించినట్లు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాములూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. అలాగే గ్రామంలో ఉన్న సమస్యలను ఆ గ్రామ ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించి అక్కడే అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, అయ్యవారిపల్లి సర్పంచ్ రామగంగిరెడ్డి, పాములూరు సర్పంచ్ మధు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవిశంకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ రవిచంద్రారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి - ఖాజీపేట

పత్తూరు సచివాలయ పరిధిలోని నాగపట్నం, పత్తూరు దళితవాడలో సోమవారం ఎమ్మెల్యే పర్యటిస్తూ సమస్యలపై ప్రజలతో ఆరా తీశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తుదారులకు పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎపి ఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబుబాకర్ సిద్దిక్, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు పివి రాఘవరెడ్డి, పత్తూరు సర్పంచ్ గడ్డం రేణుక, మండల పరిషత్ ఉపాధ్యక్షులు చంద్రభాస్కర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ గోపాల్ రెడ్డి, పుల్లూరు ఉపసర్పంచ్ ఇరగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కనపర్తి సుబ్బారెడ్డి, దొరవారి రాముడు, సర్పంచులు భూమన సుబ్బారెడ్డి, గోపిరెడ్డి పెద్దిరెడ్డి, రెడ్యం కృష్ణారెడ్డి, గంగిరెడ్డి నాగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

పిహెచ్‌సిలో నిరంతర వైద్య సేవలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పిహెచ్‌సిలో నిరంతర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని బిదినంచర్ల పిహెచ్‌సి వైద్యాధికారి సయ్యద్ ఖాజాముద్దీన్ పేర్కొన్నారు. సోమవారం పిహెచ్ సి లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. కావున అవకాశాన్ని చేసుకోవాలని ఆయన కోరారు.

అధిక వడ్డీ వ్యాపారులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తాం

ప్రజాశక్తి - ముద్దనూరు

మహిళలకు రుణాలు ఇచ్చి అధిక వడ్డీలు వసూల్ చేస్తున్న వివిధ ఫైనాన్స్ కంపెనీలకు చెందిన వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వెలుగు ఏపీఎం ఇబ్రహీం అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం ఏపీఎం ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షేర్ మైక్రో ఫైనాన్స్, స్పందన ఫైనాన్స్‌కు చెందిన వ్యాపారులు వడ్డీలకు అప్పులు ఇచ్చి అక్రమంగా అధిక వడ్డీ వసూలు చేస్తారని ఆరోపించారు. మహిళలను ప్రలోభపెట్టి అధిక వడ్డీలకు రుణాలు ఇస్తున్న ఫైనాన్స్ కంపెనీ వారిపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షులు లక్ష్మీదేవి, కోశాధికారి శ్రీదేవి, సిబ్బంది చంద్ర, మహిళలు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల సిటీ ఫారెస్ట్ (రాణితో పార్క్) ప్రజల సందర్శనకు అందుబాటులోకి తెచ్చిన గారండాల రివర్ ఫ్రంట్ పార్క్‌ను పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ ఇంచార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ వి.వర ప్రసాద్, కమిషనర్ వివి నరసింహారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కుకు వచ్చే సందర్శకుల కోసం అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. నగరవరంలో అధిక సంఖ్యలో మొక్కలు నాటించాలని, ప్రతి మొక్క పెరిగి పెద్ద చెట్టు అయ్యేవరకు చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి వేముల మండలాధ్యక్షులు రామలింగారెడ్డి, పురపాలక వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ కోడి రమణ, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఖాజీపేట



ఆర్థిక సాయం అందజేస్తున్న రాచమల్లు రవిశంకర్‌రెడ్డి

మండల పరిధిలోని తుడుమలదిన్నె గ్రామానికి చెందిన రైతు వెంకటసుబ్బారెడ్డి అప్పుల బాధ తాళలేక ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోమవారం బాధిత కుటుంబాన్ని మైదుకూరుకు చెందిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి రాచమల్లు రవిశంకర్‌రెడ్డి పరామర్శించి, తన వంతుగా రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు. రైతు ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం : పిసిసి

వేంపల్లె : వైసిపి పాలనలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వారికి వస్తున్న బిల్లులపై ఏజెన్సీలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలం సుబ్బరాయుడు, ఉత్తన్న, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్, బద్రి, రవి, శివ పాల్గొన్నారు.